TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 129 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.03.12.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

# ‘ఓట్ చోరీ’ నుంచి దృష్టి మరల్చేందుకే కేసులు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఓట్ చోరీ అంశం నుంచి దేశ ప్రజల దృష్టి మరల్చేందుకే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తమ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌పై మళ్లీ మళ్లీ అక్రమ కేసులు బనాయిస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ నేపథ్యంలో వారిరువురికి అండగా నిలుద్దామంటూ ఆయన పిలుపునిచ్చారు. కేసులకు అదిరేది లేదు.. మోడీ, అమిత్ షాలకు బెదిరేది లేదని ఆయన ఘాటుగా హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ సావంత్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకాటి శ్రీహరి, అజహరుద్దీన్, నూతనంగా నియమితులైన డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.




ఈ సందర్భంగా సీఎం డీసీసీ అధ్యక్షులకు, ఇతర నాయకులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. మోడీ సర్కార్ తమ పార్టీ పట్ల అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరిని ఆయన ఎండగట్టారు. పంచాయతీ ఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలు, గ్లోబల్ సమ్మిట్, ఇందిరమ్మ చీరెల పంపిణీ, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంపై ఆయన వారికి మార్గదర్శనం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిదని చెప్పారు. సొంత ఆస్తులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రారంభించిన ఆ కుటుంబం దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆ పత్రికకు సంబంధించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు, ఆర్థికంగా నిలబెట్టేందుకు సోనియా గాంధీ, రాహుల్ కృషి చేశారని తెలిపారు. తిరిగి ఆ పత్రికను పునరుద్ధరించడానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అవసరమైనప్పుడు మల్లికార్జున ఖర్గే లాంటి కాంగ్రెస్ ముఖ్య నాయకులను డైరెక్టర్లుగా నియమించటం ద్వారా పత్రికను పునరుద్ధరించారని వివరించారు.

ఇందులో ప్రభుత్వానికి సంబంధించిన ఏ ఒక్క రూపాయీ లేదని స్పష్టం చేశారు. నెహ్రూ వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పత్రికను నడిపితే..దీనిపై మనీ ల్యాండరింగ్ కేసు పెట్టి సోనియా గాంధీ, రాహుల్‌ను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కేసుల పేరుతో మళ్లీ ఇప్పుడు హడావుడి చేస్తున్నారని దుయ్యబట్టారు. సోనియా గాంధీ, రాహుల్‌పై కేంద్రం బనాయించిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ సీఎం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే వాటిని ఇంటిటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత డీసీసీ అధ్యక్షులు, నాయకులపై ఉందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, కోటి మంది ఆడ బిడ్డలకు కోటి చీరలను సారెగా అందిస్తున్నామని చెప్పారు. ప్రతీ ఆడబిడ్డకు చీర చేరేలా చూడాల్సిన బాధ్యత పార్టీ జిల్లా అధ్యక్షులదేనని అన్నారు. గ్రామలవారీగా సమన్వయం చేసుకుంటూ వాటి పంపిణీని పూర్తి చేయాలని కోరారు. డిసెంబర్‌లోగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ పూర్తి కావాలని, మార్చిలో పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల చీరలను పంపిణీ చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలపై ప్రతీ గ్రామంలో చర్చ నిర్వహించాలని ఆదేశించారు. రాజకీయాల్లో పనులు చేయటమే కాదు.. చేసిన వాటిని చెప్పుకోవాలని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత కార్యకర్తలందరిపైనా ఉఉందని నొక్కి చెప్పారు. జిల్లా అధ్యక్ష బాధ్యతనేది చాలా గొప్పదని వ్యాఖ్యానించారు. అయితే బాధ్యతలు, విధులు నిర్వర్తించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కొందరు ముందుకు పోకుండా కాళ్లలో కట్టెలు పెడతారని, వాటిని పట్టించుకోకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుక పోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

పెండింగ్ పదవులను భర్తీ చేస్తాం : మహేశ్ కుమార్ గౌడ్

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ%౯% వారం పది రోజుల్లో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ పదవులతోపాటు పెండింగ్‌లో ఉన్న ఇతర పదవులనూ భర్తీ చేస్తామని వెల్లడించారు. జిల్లాల్లో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందన్నారు. తాను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని కాకపోయినా పీసీసీ చీఫ్ అయ్యే అవకాశం వచ్చిందని తెలిపారు. అదే మాదిరిగా ఏళ్ల తరబడి కష్టపడితేనే పదవులు వస్తాయని వివరించారు. రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన నిర్వహించారని చెప్పారు. దాంతో కేంద్ర ప్రభుత్వం కూడా జనగణన చేయాల్సి వస్తోందని అన్నారు.

నిష్పాక్షికంగా వ్యవహరించాం : మీనాక్షి

డీసీసీ అధ్యక్షుల ఎంపికలో నిష్పాక్షికంగా వ్యవహరించామని మీనాక్షి నటరాజన్ చెప్పారు. ఇందుకు సంబంధించి ఏఐసీసీ పరిశీలకులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అందరి అభిప్రాయాలు తీసుకున్నారని తెలిపారు. సీఎం, పీసీసీ చీఫ్ తమ సొంత జిల్లాలకు కూడా ఎలాంటి పేర్లనూ ప్రతిపాదించలేదని స్పష్టం చేశారు. అందరి సహకారం, సమన్వయం వల్లే సమర్థులైన వారికి డీసీసీ అధ్యక్ష పదవులను ఇవ్వగలిగామని తెలిపారు.వారి పనితీరు ఆధారంగా ప్రభుత్వంలో కూడా సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీ అనుయాయులను గెలపించాలని, ఓట్ చోరీపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. నూతన జిల్లా అధ్యక్షులకు జనవరిలో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

# పదేండ్లు అండగా నిలబడండి

ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ అమృత్ తెలంగాణ: పాల్వంచ ”రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ఉన్నా స్థానికంగా సర్పంచులు నిజాయితీ గల వారుండాలి. మంత్రులతో కలిసి పని చేయాలి. అలాంటి వాళ్లు సర్పంచులుగా లేకపోతే.. హాఫ్ కో.. ఫుల్ కో.. మందు కోసం ఓటేస్తే గ్రామాలు దెబ్బతింటాయి. రాజకీయాలు మాని పదేండ్లు అండగా నిలబడండి, దేశంలోనే తెలంగాణను నెం.1 స్థానంలో నిలపండి” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంచి ప్రభుత్వంతోనే ప్రజలకు అన్ని సమకూరుతాయని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్ఫూర్తితో విద్య, నీటిపారుదల రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజాపాలన సాగిస్తున్నామని తెలిపారు. పాల్వంచలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ దేశానికే తలమానికమని అన్నారు. పదేండ్లుగా సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురై.. అవినీతికి లోనై

కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిపించాయని విమర్శించారు.



ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి మంగళవారం ప్రారంభించారు. హెలికాప్టర్ సమస్యతో కేవలం ముప్పావుగంట వ్యవధిలోనే సీఎం సభ ముగించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు స్ఫూర్తినిచ్చిన ప్రాంతం పాల్వంచని అన్నారు. 60 ఏండ్ల తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష నెరవేర్చిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరిట దేశంలోనే ఏకైక ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ నెలకొల్పుకోవటం గొప్ప విషయమని తెలిపారు. సంక్షోభంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాన్ని 2004 నుంచి 2014 వరకు సంక్షేమం వైపు నడిపించిన ఘనత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగేదేనని అన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశం ప్రపంచంతో పోటీపడాలనే కాంక్షతో ఎడ్యుకేషన్ అండ్ ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.

దీనిలో భాగంగానే దేశంలోని గొప్ప నీటిపారుదల ప్రాజెక్టులు, యూనివర్సిటీలు నెహ్రూ హయాంలోనే ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశాన్ని ఆకలికేకల నుంచి అత్యధిక ధాన్యాన్ని అందించే స్థాయికి తీసుకెళ్లిన ఘనత కూడా నెహ్రూదేనని తెలిపారు. బాక్రానంగల్ నుంచి నాగార్జున సాగర్ వరకూ శ్రీశైలం మొదలు శ్రీరామ్ సాగర్ వరకూ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ నెహ్రూ ప్రసాదించినవేనని వివరించారు. నెహ్రూ స్ఫూర్తితో ఎడ్యుకేషన్ అండ్ ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రపంచ పటంలో తెలంగాణను ఉన్నత స్థానంలో నిలబెడతామని అన్నారు. ‘విద్యను విస్తరించాలి.. ప్రపంచ ఖనిజ సంపద మీద పరిశోధనలు జరగాలి, సింగరేణి లాంటి సంస్థలను పెంపొందించాలి’ అనే ఉద్దేశంతోనే ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని కొత్తగూడెంలో నెలకొల్పినట్టు చెప్పారు.

ముఖ్యమైన శాఖలన్నీ ముగ్గురు మంత్రుల వద్దే..

కృష్ణా గోదావరినీ అనుసంధానించే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం అన్నారు. పదేండ్లుగా సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని, అవినీతికి లోనయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వానికి ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల వద్దనే ఉన్నాయన్నారు. భట్టి, తుమ్మల, పొంగులేటి అనుకుంటే ఈ ప్రభుత్వంలో జరగనిదేమీ లేదన్నారు. ఖమ్మం జిల్లాకు ఏది కావాలన్నా.. అడిగిందే తడువుగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, ఇందిరమ్మ చీరెలు.. ఇలా సంక్షేమ పథకాలన్నీ జిల్లా నుంచే ప్రారంభించుకున్నామని తెలిపారు. రెండేండ్ల క్రితం మీరు ఆశీర్వదించిన కారణంగానే ఈరోజు ప్రజాపాలన ఏర్పడిందన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధాని మోడీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గేను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉందన్నారు. ఖమ్మం జిల్లా ఇచ్చే ఉత్సాహంతోనే తెలంగాణను అగ్రభాగంలో నిలుపుతామన్నారు. హెలికాప్టర్ సమస్య వల్ల ఈసారి పర్యటన వాయిదా పడిన నేపథ్యంలో మరోసారి వస్తానంటూ సీఎం ప్రసంగం ముగించారు.

దేశానికే తలమానికం ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ.. మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి

దేశానికే తలమానికం అయిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీని ప్రపంచస్థాయికి తీసుకెళ్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. త్వరలోనే ఈ విశ్వవిద్యాలయానికి కావాల్సిన సౌకర్యాలన్నీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా సంపూర్ణంగా నిలబడటంతోనే ఈ ప్రభుత్వం ఏర్పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయటంతోపాటు థర్మల్ పవర్ స్టేషన్, రైల్వేలైన్, విమానాశ్రయంతోపాటు ప్రపంచానికి దీటుగా ఉండే.. ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీని జిల్లాలో నెలకొల్పినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఖనిజ సంపద ఉన్న ప్రాంతానికి ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఇచ్చినందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, ఖమ్మం, భద్రాచలం ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాళోత్ రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, వివిధ కార్పొరేషన్‌ల చైర్మెన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మువ్వా విజరుబాబు, అదనపు కలెక్టర్ విద్యాచందన, వేణుగోపాల్, ఆర్డీవో మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానాలు

హైదరాబాద్ : తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సీఎంలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. రాష్ట్ర మంత్రులు స్వయంగా వెళ్లి వారిని ప్రత్యేకంగా కలిసి సదస్సుకు ఆహ్వానిస్తారు. ఈ నెల 4న మంత్రులు ఆయా రాష్ట్రాలకు వెళ్లి డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే సమ్మిట్ ఆహ్వాన లేఖలు అందిస్తారు. ఎవరెవరు ఏఏ రాష్ట్రాలకు వెళ్లాలో సీఎం మంగళవారం ఖరారు చేశారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్ ,హర్యానాకు దామోదర రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కర్ణాటక, తమిళనాడుకు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తరప్రదేశ్‌కు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజస్తాన్‌కు పొన్నం ప్రభాకర్ వెళ్లి ఈ ఆహ్వాన లేఖలను అందిస్తారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌కు కొండా సురేఖ, పశ్చిమ బెంగాల్‌కు సీతక్క, మధ్యప్రదేశ్‌కు తుమ్మల నాగేశ్వరరావు, అసోంకు జూపల్లి కృష్ణారావు, బీహార్‌కు వివేక్ వెంకటస్వామి, ఒడిశాకు వాకిటి శ్రీహరి, హిమాచల్‌ప్రదేశ్‌కు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహారాష్ట్రకు మహమ్మద్ అజారుద్దీన్ ఆహ్వాన లేఖలను అందిస్తారు. కాగా ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులు, గవర్నర్లకు రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఆహ్వానం అందించనున్నారు.

# భూకుంభకోణంపై ‘బీఆర్ఎస్ పోరుబాట’



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ మహానగర పరిధిలో రూ.ఐదు లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను, ‘హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ’ (హిల్ట్) పేరుతో చేసే భూకుంభకోణంపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పోరుబాటకు సిద్ధమైంది. ఆ పాలసీ వల్ల ప్రజలకు కలిగే నష్టంపై నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని నిర్ణయించింది. పారిశ్రామికవాడల్లో పర్యటించడం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన ‘నిజనిర్ధారణ బృందాలను’ ఏర్పాటు చేశారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు ‘మల్టీ యూజ్ జోన్’ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ.ఐదు లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని విమర్శించారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రూ.వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు.

నేడు, రేపు పారిశ్రామిక వాడల్లో బృందాల పర్యటన

ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను ఎనిమిది క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు బుధ, గురువారాల్లో పర్యటించనున్నాయని కేటీఆర్ వివరించారు. అక్కడ స్థానిక నాయకులు, ప్రజలను కలుపుకుని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచుతారని చెప్పారు. క్లస్టర్–1లో మాజీమంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో గంగుల కమలాకర్, దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శిస్తారని అన్నారు. క్లస్టర్–2లో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సురభి వాణీదేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారని వివరించారు. క్లస్టర్–3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, రవీందర్‌రావులు మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడలను సందర్శిస్తారని చెప్పారు.

క్లస్టర్–4లో తనతోపాటు సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. క్లస్టర్–5లో తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, నవీన్ రావులు సనత్ నగర్, బాలానగర్ ప్రాంతాలను పరిశీలిస్తారని చెప్పారు. క్లస్టర్–6లో మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి, శంభీపూర్ రాజు కలిసి మేడ్చల్ ఇండిస్టియల్ పార్కుకు వెళ్తారని అన్నారు. క్లస్టర్–7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్వామిగౌడ్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి కలిసి కాటేదాన్, హయత్‌నగర్‌లో పర్యటిస్తారని వివరించారు. క్లస్టర్–8లో మాజీమంత్రి మహమూద్ అలీ, దాసోజు శ్రవణ్, ఎండీ సలీం, చందులాల్ కలిసి బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారని చెప్పారు.

# విత్తన బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ముసాయిదా విత్తన బిల్లు - 2025 రూపకల్పనలో ప్రతి వర్గ అభిప్రాయం కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతులు, విత్తన డీలర్లు, కంపెనీలు, రైతు ఉత్పాదక సంఘాలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్న ప్రత్యేక సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త విత్తన బిల్లు రైతు ప్రయోజనాలను కాపాడేలా, నాణ్యమైన విత్తనాల సరఫరాపై కట్టుదిట్టమైన నియంత్రణలు ఉండేలా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయి రైతు నుంచి శాస్త్రవేత్త వరకు అందరి సూచనలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు. ౖ అందరి సూచనలను లిఖితపూర్వకంగా సేకరించి రాష్ట్రానికి పంపాలని, నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాల కొరత, అధిక ధరలు, నకిలీ విత్తనాల విక్రయం, విత్తనం వల్ల పంట నష్టపోయినప్పుడు కంపెనీల బాధ్యత వంటి అంశాలను ప్రస్తావించారు. పంటలు విఫలం అయినప్పుడు రైతుకు రక్షణ కల్పించే విధానాలు బిల్లులో ఉండాలని కోరారు. రైతు ఉత్పాదక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, స్థానిక విత్తన ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని, నిల్వ, రవాణా సదుపాయాలను విస్తరించాలని కోరారు. చిన్న రైతులకు అందుబాటులో ఉండే విధంగా విత్తన విధానం ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ,విత్తన తనిఖీ దళాల బలోపేతం, ల్యాబ్‌లలో ఆధునిక పరికరాలు, రైతులకు అవగాహన కార్యక్రమాల అవసరాన్ని వివరించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్,ADA లు, విత్తన కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు,వ్యవసాయ విజ్ఞాన కేంద్రశాస్త్రవేత్తలు, అధికారులు, పాల్గొన్నారు.

## నీతి ఆయోగ్ విడుదల చేసిన 2025 సెప్టెంబర్ త్రైమాసిక డెల్టా ర్యాంకింగ్స్‌లో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం దేశవ్యాప్తంగా ఉన్న 500 బ్లాక్‌లలో 4వ స్థానం,

అమృత తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి నీతి ఆయోగ్ విడుదల చేసిన 2025 సెప్టెంబర్ త్రైమాసిక డెల్టా ర్యాంకింగ్స్‌లో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం దేశవ్యాప్తంగా ఉన్న 500 బ్లాక్‌లలో 4వ స్థానం, అలాగే దక్షిణ భారతంలోని జోన్-3లో 1వ ర్యాంక్ సాధించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. ఈ అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా నార్నూర్ మండలానికి రూ.1.5 కోట్లు పురస్కారం లభించిందని తెలిపారు. ఇటువంటి జాతీయ స్థాయి గుర్తింపు మరోసారి రావడం నార్నూర్ మండలాన్ని దేశంలోని అత్యుత్తమ ప్రదర్శన చేసే మండలాల్లో ఒకటిగా నిలబెట్టడమే కాక, ఇది మొత్తం జిల్లా ప్రజలకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. తాజాగా వచ్చిన డెల్టా ర్యాంకింగ్స్‌తో పాటు, నార్నూర్ ఇప్పటి వరకు వివిధ పురస్కారాలు, ప్రోత్సాహకాలను కలిపి



మొత్తం రూ.2.78 కోట్లు పొందింద ని తెలిపారు. వీటిలో ప్రధానమంత్రి అవార్డు, దేశవ్యాప్తంగా టాప్-5 ప్రదర్శనలో స్థానం, గవర్నర్ అవార్డు, స్టేట్స్ యూజ్ - కేస్ చాలెంజ్‌లో 8 లక్షలు, ఎడ్యుకేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్, అదేవిధంగా నీతి ఆయోగ్ నుండి 7 ప్రశంసా పురస్కారాలు ఉన్నాయన్నారు. ఈ విజయాలు నార్నూర్ మండలంలోని నిరంతర అభివృద్ధి, శ్రేష్ఠ పాలనతో పాటు ప్రజాకేంద్రీకృత కార్యక్రమాలను ప్రతిబింబంగా నిలుస్తున్నాయనీ కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు.





సీఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ అఖిల్ మహాజన్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేసారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెత్తనంపై తిరుగుబాటు: నాయకురాలి వెంట నడిచిన టెంబోర్ని!

## పార్టీలకు అతీతంగా ఐకమత్యం - నిమ్మల లలితాశ్రీధర్ రెడ్డి నామినేషన్



సర్పంచ్ కు నామినేషన్ వేసిన లలిత శ్రీధర్ రెడ్డి

నిర్మల్ జిల్లా నర్సపూర్ జి, డిసెంబర్ 02: అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని టెంబుర్ని గ్రామంలో గ్రామంలో ఒకరి నిరంకుశమైన పెత్తనం నచ్చక విసిగిపోయిన టెంబోర్ని గ్రామం ప్రజలు తమ ఐక్యతను చాటారు. సాధారణంగా ఎన్నికలంటే వర్గపోరు ఉండే చోట, మండలంలోని టెంబోర్ని గ్రామ ప్రజలు పార్టీలకు అతీతంగా ఏకమై తమ ఊరు మెచ్చిన మహిళా నాయకురాలు శ్రీమతి నిమ్మల లలితాశ్రీధర్ రెడ్డికి ఘనంగా మద్దతు పలికారు.

పండుగ వాతావరణంలో నామినేషన్

గ్రామాన్ని వేధించిన 'పెత్తనాన్ని' పారదోలాలనే సంకల్పంతో టెంబోర్ని జనం ఏకమై ఒకే నాయకురాలి వెంట నిలబడటంతో, సోమవారం రాంపూర్ క్లస్టర్లో నామినేషన్ దాఖలు ప్రక్రియ పండుగ వాతావరణాన్ని తలపించింది.

గ్రామం నుండి డప్పులు, బాజా భజంత్రీలతో, కోలాహలంగా బయలుదేరిన ప్రజలు లలితాశ్రీధర్ రెడ్డిని తమ గుండెల్లో పెట్టుకొని రాంపూర్ క్లస్టర్ వరకు తీసుకువచ్చారు. స్థానిక రిటర్నింగ్ అధికారి వద్ద ఆమె ఒకే నామినేషన్ దాఖలు చేశారు.

ఊరంతా ఏకతాటిపై

ఈ సందర్భంగా అత్యంత అరుదైన దృశ్యం కనిపించింది. సర్పంచ్ ఎన్నికల్లో తలపడే ప్రధాన పార్టీల నాయకులు అందరూ కూడా లలితాశ్రీధర్ రెడ్డి నామినేషన్ ప్రక్రియలో కలిసి పాల్గొనడం ఈ ఐక్యతకు నిదర్శనం. రాజకీయ భేదాలు మరచి, గ్రామాభివృద్ధి, శాంతియుత పాలన కోసం ఊరంతా ఏకతాటిపైకి వచ్చిన తీరు రాంపూర్ క్లస్టర్‌లోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది ఇది కేవలం ఒక నామినేషన్ కాదు, పెత్తనంపై టెంబోర్ని ప్రజల చారిత్రక స్పందన అని స్థానికులు ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. ఊరు జనం మొత్తం ఈ మహిళా అభ్యర్థికి మద్దతుగా నిలబడటంతో, టెంబోర్ని ప్రజల తీర్పు స్పష్టంగా కనిపిస్తోంది.

# వాసవి విద్యార్థులకు బహుమతులు అందజేత.......

## దసరా ఉత్సవ సమితి విశ్వహిందూ పరిషత్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు...... ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు.....



క్విజ్ పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వాసవి యజమాన్యం



బహుమతులు పొందిన విద్యార్థిని విద్యార్థులు

నిర్మల్ జిల్లా డిసెంబర్ 2 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో దసర ఉత్సవ సమితి ద్వార విశ్వహిందు పరిషత్ నిర్మల్ శాఖ వారి ఆధ్వర్యంలో క్విజ్ మరియు దేశభక్తి పాటల లాంటి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులంత పాల్గోనగా వాసవి విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన వాసని విద్యార్థులు క్విజ్ లో మొదటి బహలమతిని అందుకున్నారు. దేశభక్తి పాటల పోటీలో ఆర్.సృజన్ 10వ తరగతి విద్యార్థి రెండవ బహుమతి గెలుచుకున్నాడు. దసర ఉత్సవ సమితి విశ్వహిందు పరిషత్ వారు ఈ బహుమతులను ప్రధానం చేశారు. అటుపిమ్మట దసర ఉత్సవ సమితి కన్వీనర్ బి. జనార్ధన్, మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు . దసర నవరాత్రుల వేడుకల సందర్భంగా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రామాయణం, మహాభారతం గ్రంధాల విశిష్టతపై ఈ పోటీలు నిర్వహించామని చెప్పారు. హిందు సంస్కృతి సంప్రదాయాలపై విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి విద్యా సంస్థల కరస్పాండెంట్ ఇ.పోతారెడ్డిగారు, సెక్రటరీ ఎన్. జగదీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.రాజ్ కుమార్, విశ్వహిందు పరిషత్ అధ్యక్షుడు మూర్తిప్రభు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గోన్నారు

# ప్రజలందరి భాగస్వామ్యం తో పట్టణ అభివృద్ధి.ఎమ్మెల్యే: డాక్టర్ సంజయ్ కుమార్



జగిత్యాల అమృత్ తెలంగాణ నవంబర్ 02: పట్టణంలోని 14వ వార్డులో మంగళవారం 15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, అడువాల జ్యోతి లక్ష్మణ్, తాజా మాజీ కౌన్సిలర్లు కూతురు పద్మ, బద్దం జగన్ మోహన్ రెడ్డి, రాజేష్ కోరే గంగమల్లు పాల్గొన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

# బిఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి బీజేపీ లో చేరిన నాయకులు






కండువాలు కప్పి పార్టీలోకి ఆవిరించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా సొన్ డిసెంబర్ 02 అమృత్ తెలంగాణ సోన్ మండలం సంగంపేట్ గ్రామ తాజామాజీ సర్పంచ్ మారి విలాస్ తో పాటు ముఖ్య నాయకులు కస్తూరి నారాయణ, ద్యావత్ శ్రీనివాస్,ద్యావత్ ప్రశాంత్, కస్తూరి శ్రీనివాస్, తాళ్ళ ప్రవీణ్, బంక మనికిరణ్, జొర్రిగ సంతోష్, బంక అన్వేష్ , సంఘం గణేష్, సంగెం ప్రశాంత్, తో పాటు 30 మంది యువకులు, కార్యకర్తలు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి గారు వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, నాయకులు అంకం శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, భీమ్ రావు, ద్యావతి ప్రశాంత్, తో పాటు మండల గ్రామ బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత బస్టాండ్ ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలి: సీపీఐ(ఎం)

వనపర్తి అమృత్ తెలంగాణ: వనపర్తి ఆర్టీసీ పాత బస్టాండ్ ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని సీపీఐ(ఎం) టౌన్ కమిటీ కార్యదర్శి పరమేశ్వర చారి కోరారు. వనపర్తి పట్టణ సీపీఐ(ఎం) టౌన్ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి ఆర్టిసి డిపో అధికారి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం మంగళవారం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న పాత బస్టాండ్ ను తాత్కాలికంగా వినియోగంలోకి తెచ్చారు. కానీ దాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని పాత బస్టాండ్ కాంపౌండ్ స్థలంలో పూర్తి స్థాయిలో సిసి బెడ్ నిర్వహించాలని డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. వచ్చి పోయే ప్రయాణికులకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణికులు కూర్చోవడానికి షెడ్డు ఏర్పాటు చేసి కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆవరణ లోపల పూల మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాత బస్టాండ్ ముందు పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం గడిపే వారికి షట్టర్లతో డబ్బాలు ఏర్పాటు చేసి కిరాయికి ఇవ్వాలన్నారు. లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎక్కడ అన్యాక్రాంతం కాకుండా పాత బస్టాండ్ విస్తరణ ఎంత ఉందో అంత పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవాలని సీపీఐ(ఎం) గా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి పరమేశ్వరాచారి, గంధం గట్టయ్య, గంధం మదన్, జి, బాలస్వామి, రమేష్, నందిమల్ల రాములు, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ డీసీసీ అధ్యక్షులుగా ఎంపికైన వెడ్మ బొజ్జు పటేల్ గారిని సన్మానించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సన్మానిస్తున్న దృశ్యం

అమృత తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఇటీవల ప్రకటించిన డిసిసి అధ్యక్షుల జాబితాలో నిర్మల్ జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన ఖానాపూర్ శాసనసభ్యులు ! శ్రీ వెడ్మ బొజ్జు పటేల్ ని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి గారి పర్యటన ఏర్పాట్లని పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయనను జిల్లా కేంద్రంలోని పెన్ గంగా భవన్ లో కాంగ్రెస్ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేసారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, అలీమ్ ఖాన్, సమీఉల్లా ఖాన్, రహీమ్ ఖాన్, అఫ్సర్ , మాజీ ఎంపిటిసి పరమేశ్వర్, ఫహీమ్, వసీం రంజని తదితరులు ఉన్నారు.

## ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి: కలెక్టర్

వనపర్తి ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధితులకు చికిత్స, సేవలు అందిస్తున్న సిబ్బందికి మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో ప్రశంసా పత్రాలను అందజేశారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు.

## జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కి స్వాగతం పలికిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు పక్కన బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఈనెల 4 వతేదీన ఆదిలాబాద్ జిల్లాకేంద్రములో జరగనున్న సీఎం రేవంత్ రెడ్డిగారి పర్యటన దృశ్యా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసినటువంటి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు ని మావల బైపాస్ తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి స్వాగతం పలికి వారితో కలిసి సభా స్థలి ఏర్పాట్లను పర్యవేక్షించడం జరిగింది.కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు, వేణుగోపాల చారి, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్ నాయక్, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి, గంద్రత్ సుజాత, గణేష్ రెడ్డి, సంతోష్ రావు , దేరా కృష్ణ రెడ్డి, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్ర శేఖర్, మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి, రహీం ఖాన్, రెండ్ల రాజన్న , ప్రవీణ్ రావుల,అలీమ్ ఖాన్ సమీఉల్లా ఖాన్ ,దినేష్ ,అక్షయ్ తదితరులు ఉన్నారు.

## జగిత్యాల మాత శిశు ఆరోగ్య కేంద్రం లో కుటుంబ నియంత్రణ శిబిరం.



కోరుట్ల రూరల్ డిసెంబర్ 02: జగిత్యాల జిల్లా కోరుట్ల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో డిసెంబర్ 1 నుండి వారం రోజుల పాటు కుటుంబ నియంత్రణ శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇస్తామని, అన్ని రకాల సేవలకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పిహెచ్సి ఐలాపూర్‌లో జరిగిన ఆశా డే సమావేశంలో గర్భిణీ మహిళల ఆరోగ్య పరిస్థితులను, వారికి అందుతున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తల్లి పిల్లల ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ప్రాధాన్యత ఇస్తామని, పురుషులకు, మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. వైద్యులు, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్ల పనితీరును సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## సర్పంచ్ పదవికి వేలం పాట

### ఉపసర్పంచ్,వార్డు సభ్యులకు.. వేలం వేసే ఆలోచన..!

### బహిష్కరించాలని కొందరు గ్రామస్తులు



అడ్డుకుంటున్న గ్రామస్తులు

మెట్ పల్లి రూరల్ డిసెంబర్ 02: జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో సర్పంచ్ పదవిని బీసీ రిజర్వేషన్ కింద కేటాయించినప్పటికీ, గ్రామ వీడీసీలు ఓసీలకు సమాచారం ఇవ్వకుండానే రూ. 28.60 లక్షలకు వేలం పాట నిర్వహించారని, దీనిని అడ్డుకున్నందుకు కొందరు గ్రామస్తులను బహిష్కరించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. మంగళవారం ఉప సర్పంచ్, వార్డ్ సభ్యుల పదవులకు కూడా వేలం పాటలు నిర్వహిస్తున్నారని, బహిష్కరించబడిన వారితో ఎవరూ మాట్లాడకూడదని, నిత్యావసరాలు, వైద్య సేవలు, మీ సేవ వంటి వాటిని పొందకూడదని, వేలం ద్వారా వచ్చిన డబ్బులు వారికి చెందవని ఆదేశాలు జారీ చేశారని బాధితులు మెట్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరద కాలువ కోసం సేకరించిన ప్రభుత్వ భూమిని గ్రామ వీడీసీలు తమ స్వంతం చేసుకోవాలని చూస్తున్నారని, దీనిని వ్యతిరేకించినందుకే తమను బహిష్కరించారని బాధితులు ఆరోపించారు.వేలం పాటలు వేసి ఓటుకు తూట్లు పొడుస్తున్నారు,ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తూ,రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు,డబ్బున్న వారే సర్పంచులుగా అవుతారని,సామాన్యునికి సర్పంచ్ పదవి అందని ద్రాక్షే అవుతుందని మేధావి వర్గం,ప్రజలు,వాపోతున్నారు.

## కాంగ్రెస్ ఖాతాలో తొలి సర్పంచ్





అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ అభివృద్ధి అధికార పార్టీతోనే సాధ్యం, ప్రజల ఆశలు నెరవేర్చే పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిది – బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సిరికొండ మండలంలోని కుంట గూడ గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవంగా కాంగ్రెస్ ఖాతాలో చేరాయి సర్పంచ్‌గా కుమ్రం మీరా యాదవ్ రావు, ఉప సర్పంచ్‌గా చిక్రం పరమేశ్వర్ ఎన్నికయ్యారు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ని ఆయన నివాసం బొందిడి గ్రామంలో వారు మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు వారిని సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ కుంట గూడ గ్రామ పంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే 10 లక్షలతో పాటు నాకు వచ్చే నిధులలో నేను కూడా 10 లక్షలు మంజూరు చేస్తా అని ఆయన అన్నారు కుంట గూడకు రాబోయే విడతలో అదనపు ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేకంగా కృషి చేస్తాను, కుంట గూడను అన్ని విధాల అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని ఆడే గజేందర్ అని తెలిపారు ఈ కార్యక్రమంలో సిరికొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఇమామ్, భూపతి, రాథోడ్ రమేష్ ,యండి సద్దాం తదితరులు ఉన్నారు

## చైనా మాంజా విక్రయంపై జిల్లాలో ప్రత్యేక తనిఖీలు

### కఠిన సూచనలు జారీ చేసిన జిల్లా పోలీసులు







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి. చైనా మాంజా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదు – జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ జిల్లాలో చైనా మాంజా విక్రయాన్ని నిరోధించేందుకు జిల్లా పోలీస్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పతంగులు ఎగరేసే సీజన్ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చైనా మాంజ వినియోగం, రవాణా, నిల్వ మరియు విక్రయాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు నిర్మల్ పట్టణంలోని కిరాణా దుకాణాలు, చిన్నపాటి వ్యాపార కేంద్రాలను సందర్శించి అక్కడ చైనా మాంజా నిల్వ లేదా విక్రయం జరుగుతోందా అని పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులకు చైనా మాంజా విక్రయం చట్టపరంగా నిషేధించబడిందని, దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా తెలియజేశారు. పర్యావరణానికి హానికరంగా ఉండే ఈ మాంజా ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేసే ఘటనలు అనేక ప్రాంతాల్లో నమోదవుతున్న నేపథ్యంలో, నిర్మల్ జిల్లా పోలీస్ తమ పరిధిలో ఈ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు సంకల్పబద్ధంగా చర్యలు చేపడుతోంది. పోలీసులు ప్రజలను కూడా అప్రమత్తం చేస్తూ చైనా మాంజా అమ్మకం, కొనుగోలు, ఉపయోగం వంటి వాటిని ఎక్కడ గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పతంగులు ఎగరేసేటప్పుడు సురక్షిత మాంజానే ఉపయోగించాలి, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పట్టణ ఎస్ఐ సంజీవ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్ - వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్.

డిసెంబర్ 4వ తారీఖున అమలులో ఉండనున్న ట్రాఫిక్ నిబంధనలు.
అంకోలి,తంతోలి గ్రామ ప్రజలకు కె ఆర్ కె కాలనీ మీదుగా, పిట్టల వాడ గుండా పట్టణానికి చేరుకోవాలి.
ఏరోడ్రం నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డుపై పూర్తిగా ఉండనున్న ఆంక్షలు.
నిర్మల్, మావల మీదుగా సభకు వచ్చే బస్సులు పిట్టలవాడ, మావల పోలీస్ స్టేషన్ మీదుగా
తెలంగాణ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాల లో పార్కింగ్ చేయాలి.
మీటింగ్ సందర్భంగా వచ్చిన ప్రజలు నిర్దేశించిన ప్రదేశాలలోనే పార్కింగ్ చేయాలి.
పార్కింగ్ చేసిన తర్వాత పట్టణ అంతర్గత రోడ్ల ద్వారా స్టేడియం ద్వారానికి ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ మీదుగా నడక మార్గం ద్వారా చేరుకోవాలి.

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : డిసెంబర్ 4వ తారీఖున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆదిలాబాద్ పట్టణ పర్యటన సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో పలు ట్రాఫిక్ డైవర్షన్లు ఉండనున్నట్లు వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు. ట్రాఫిక్ ఆంక్షలు డిసెంబర్ 4వ తారీఖు ఉదయం నుండి అమలులో ఉండనున్నట్లు తెలిపారు. అంకోలి, తంతోలి వైపు నుండి వస్తున్న గ్రామ ప్రజలు పట్టణంలోని కేఆర్కే కాలనీ మీదుగా, మావల పోలీస్ స్టేషన్ మీదుగా తిరుమల పెట్రోల్ బంక్ మీదుగా పట్టణానికి చేరుకోవాలని, ఆర్ఆర్ కాలనీ, హ్యాండీక్యాప్డ్ కాలనీ ప్రజలకు అదే నియమాలు వర్తిస్తాయని తెలిపారు. స్థానిక ఏరోడ్రం వద్ద నుండి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కలెక్టర్ చౌరస్తా వరకు సాధారణ ప్రజలకు అనుమతులు ఉండవని, ప్రజలు నిత్యవసర అవసరాలకు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని తెలిపారు. విఐపి వాహనాలు విఐపి వాహనాలు ఎన్టీఆర్ చోటు మీదుగా కాన్వెంట్ స్కూల్ ముందు నుండి శ్రీ సరస్వతి శిశు మందిర్, టిటిడి కళ్యాణ మండపానికి చేరుకోవాలి.


సభాస్థలికి వచ్చే ప్రజలకు పార్కింగ్ ప్రదేశాలు

టు వీలర్ ప్రజలకు స్థానిక రామ్ లీలా మైదానం, సైన్స్ డిగ్రీ కళాశాల.

ఆటోలకు మరియు కార్లకు పట్టణంలోని డైట్ కళాశాల మైదానం.

వీఐపీలు, వీఐపీలు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ మరియు టిటిడి కళ్యాణమండపం వినియోగించుకోవాలని తెలిపారు.

నిర్మల్ నుండి వచ్చే బస్సులు, భారీ వాహనాలకు పిట్టల వాడ, మావల పోలీస్ స్టేషన్ మీదుగా తెలంగాణ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాల లో పార్కింగ్.




టు వీలర్లు, కార్లు, ఆటోలు తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాలలో పార్కింగ్ చేసిన తర్వాత నడక మార్గంలో ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ దారిలో మీటింగ్ ప్రదేశానికి చేరుకోవాలి. ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ ప్రదేశాలలో నిలిపి నడుచుకుంటూ అంతర్గత రోడ్ల ద్వారా సభాస్థలికి రావాలని తెలిపారు. నిర్దేశిత ప్రాంతాలలో తప్ప వేరే రూట్లలో, రోడ్డుపై పార్కింగ్ చేయరాదు. స్థానిక కలెక్టర్ చౌరస్తా నుండి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మరియు ఏరోడ్రం వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్లు ప్రజలు సహకరించాలని తెలిపారు.

# థర్డ్ ఫేజ్ నామినేషన్ స్వీకరణకు ఏర్పాట్ల పూర్తి: కలెక్టర్



భువనగిరి :అమృత్ తెలంగాణ: సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే మూడవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు చౌటుప్పల్, నారాయణపూర్, అడ్డగూడూర్, మోత్కూర్, గుండాల, మోటకొండూర్ మండలాలకు సంబంధించి 124 గ్రామపంచాయతీలు, 1086 వార్డులకు జరిగే మూడవ విడత నామినేషన్ ప్రక్రియ కి సంబందించి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని, నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రక్రియ ను త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణ లో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించరని.. నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారికి మాత్రమే అనుమతి ఉ ంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల సంఘం జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు.

# ఐహెచ్ఆర్సిఐ భువనగిరి జిల్లా శాఖ అధ్యక్షుడిగా కుకటపు చంద్రశేఖర్



భువనగిరి.అమృత్ తెలంగాణ: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా భువనగిరి జిల్లా శాఖ అధ్యక్షుడిగా భువనగిరి పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సంఘ సేవకుడు కుకటపు చంద్రశేఖర్ గుప్తాను నియమించి హైదరాబాదులోని జాతీయ కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు కటకం శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ సామ శ్రీధర్, తెలంగాణ స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఉత్తమ్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రము, ఐడి కార్డు అందజేశారు. ఆయనతోపాటుగా భువనగిరి జిల్లా జనరల్ సెక్రెటరీగా బిజ్జాల శ్రీనివాస్ కూడా నియామక పత్రము అందుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన భువనగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నేను ఎల్లవేళలా సంస్థకు చెడు పేరు రాకుండా మంచి మార్గంలో పనిచేస్తానని అదే కాకుండా ప్రజాసేవకు అంకితమై తన వంతు కృషిచేసి ఎక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరిగినా అక్కడ మేము ఉంటామని భువనగిరి జిల్లాలో ఐ హెచ్ ఆర్ సి ఐ సంస్థకు మేలు చేస్తానని నా నియామకానికి సహకరించిన ఐ హెచ్ ఆర్ సి ఐ అగ్ర నాయకులు కటకం శ్రీనివాస్, కల్వ వీరేందర్, సరాఫ్ రజనీష్ , సరాఫ్ తులసి గుప్తా, వాడకట్టు శ్రీకాంత్ గుప్తా, అయిత భాస్కర్, సామ శ్రీధర్, ఐహెచ్ఆర్సిఐ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐ. హెచ్. ఆర్. సి. ఐ కి సంబంధించిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి: టీయూడబ్ల్యూజే



వేములవాడ :అమృత్ తెలంగాణ: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్‌లో జరగనున్న మహా ధర్నా కరపత్రాలను వేములవాడ పట్టణంలో మంగళవారం కరపత్రాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దండి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలి, ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలి ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి, వృత్తి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి అని అన్నారు. డిసెంబర్ 3న హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయడానికి రాష్ట్ర, జాతీయ, జిల్లా, మండల స్థాయి నాయకులు, యూనియన్ సభ్యులు భారీగా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రేగుల దేవేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, జిల్లా జాయింట్ సెక్రెటరీ రాపల్లి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ దూలం సంపత్, కార్యవర్గ సభ్యులు మ్యాన శ్రీనివాస్, ఉల్లెందుల మల్లేశం, సయ్యద్ పాష, జర్నలిస్టులు గడిల ప్రవీణ్ కుమార్, ఎం.ఏ. కలీం పాషా, గంప మహేష్, తోట అనిల్ కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూం కాలనీని పట్టించుకోరా..!



హుస్నాబాద్ : అమృత్ తెలంగాణ: హుస్నాబాద్ పట్టణం లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమస్యలను అధికారులు స్థానిక మంత్రి పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీ లో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా వారిందని దీంతో దుర్వాసనతో బాధపడుతున్నామని అన్నారు. విధి దీపాలు లేక పట్టణానికి రాత్రి వేళలో వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నామన్నారు. పెండింగ్ నిర్మాణం లో ఉన్న డబల్ బెడ్ రూమ్ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ స్సుద్దా చంద్రయ్య , పట్టణ అధ్యక్షులు మేకల వికాస్ యాదవ్, నాయకులు జెరిపోతుల లక్ష్మణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో బైక్ -ఆటో ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

వేములవాడ అమృత్ తెలంగాణ: వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్ చాకలి ఘాట్ల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. బైక్ , ఆటో ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కి తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్ళాడు. అప్రమత్తమైన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. కొద్దిరోజుల క్రితం ఇదే ప్రాంతంలో బైక్ అదుపుతప్పి కాలువలో పడిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ కేసు నమోదు చేశారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 'ముత్యమల్లే' మెరిసిన జాన్వీ జాన్వీ



ఈ కొత్త రూపంతో మతులు చెడగొడుతోంది. చూడటానికి కొంచెం సింపుల్ గా ఉన్నా కానీ, ముత్యాలు బీడ్స్ తో ఈ పొడవాటి లెహంగాను సర్వాంగ సుందరంగా డిజైనర్ మలిచారు. వేకువ ఝామును మంచు పూలు మిలమిల మెరిసాయి. కానీ ఈ దృశ్యంలో జాన్వీ కపూర్ మంచి ముత్యమల్లే మెరుస్తోంది. మెరుపు లాంటి జాన్వీ కుర్రకారు గుండెల్లో భడభాగ్నిని రాజేస్తోంది. ఈ సుందరమైన దృశ్యం కేన్స్ 2025 ఉత్సవాల్లో కనిపించింది. మొట్టమొదటి సారి జాన్వీ కపూర్ కేన్స్ లో ఆరంగేట్రం చేసింది. కేన్స్ లో తాను నటించిన 'హోమ్ బౌండ్' స్క్రీనింగ్ లో ఈ అద్భుతమైన లుక్ తో కనిపించింది. జాన్వీ ఈ కొత్త రూపంతో మతులు చెడగొడుతోంది. చూడటానికి కొంచెం సింపుల్ గా ఉన్నా కానీ, ముత్యాలు బీడ్స్ తో ఈ పొడవాటి లెహంగాను సర్వాంగ సుందరంగా డిజైనర్ మలిచారు. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని దీనిని డిజైన్ చేసారు. ఈ లుక్ లో గ్రేస్ ఉంది. గ్లామర్ ని సాంప్రదాయ బద్ధంగా ఎలివేట్ చేసే నైపుణ్యం కనిపించింది. ధడక్ తో ఆరంగేట్రం చేసిన జాన్వీ సహనటుడు ఇషాన్ ఖట్టర్ కూడా కేన్స్ 2025లో సందడి చేస్తుండడం విశేషం. అతడు విశాల్ జెత్వా కూడా జాన్వీతో పాటు కేన్స్ లో సందడి చేస్తూ కనిపించారు. ఈ ముగ్గురూ కేన్స్ 2025 లో 'హోమ్ బౌండ్' ప్రపంచ ప్రీమియర్ కోసం ఆత్రుతగా కనిపించారు. ఈ ఉత్సవాల్లో జాన్వీ కపూర్ గురూజీ, ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ కూడా ఉన్నారు. కరణ్ ధర్మ ప్రొడక్షన్స్ భాగస్వామి అయిన బిలియనీర్ అదర్ పూనవాలా భార్య నటాషా కూడా ఈ ఉత్సవాలలో సందడి చేసారు. జాన్వీతో సోదరి ఖుషీ కపూర్, ఆమె ప్రియుడు శిఖర్ పహారియా కూడా బృందంలో చేరారు. వారి స్నేహితుడు ఓర్హాన్ అవత్రమణి అలియాస్ ఓర్రీ కూడా సందడి చేయడం హాట్ టాపిగ్గా మారింది. నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన హోమ్ బౌండ్ ప్రచారానికి మిత్రులు అంతా ఏకమవ్వడం విశేషం.

# తెలుగు దర్శకుడిపై నటి కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు



తాజాగా నటి సయామీ కౌర్ తన కెరీర్ ఆరంభంలో జరిగిన వేధింపుల ఘటనను గుర్తు చేసుకున్నారు. మీటూ ఉద్యమ పర్యవసానంలో చాలా మంది నటీమణులు మేల్ కోస్టార్స్ పై ఆరోపిస్తూ తెరపైకొచ్చారు. కొందరిపై కోర్టుల పరిధిలో విచారణలు జరిగాయి. ఏళ్ల తరబడి గ్యాప్ వచ్చాక ఆరోపించడం వల్ల ప్రయోజనం శూన్యం అని నిరూపణ అయింది. ఈ కేసుల్లో పోలీసులు సాక్ష్యాధారాలను సమర్పించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికీ కొన్నేళ్ల క్రితం జరిగిన ఘటనలను ప్రస్థావిస్తూ నటీమణులు కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు చేయడం హాట్ టాపిగ్గా మారుతోంది. తాజాగా నటి సయామీ కౌర్ తన కెరీర్ ఆరంభంలో జరిగిన వేధింపుల ఘటనను గుర్తు చేసుకున్నారు. పాపులర్ బాలీవుడ్ వెబ్ సైట్ తో మాట్లాడుతూ సయామీ సంచలన వ్యాఖ్యలు చేసారు. తనకు 19 -20 ఏళ్ల వయసు ఉన్నప్పుడు అవకాశాల కోసం ప్రయత్నించగా, ఆ సమయంలో ఒక మహిళా ఏజెంట్ తనను రాజీ పడాల్సిందిగా దర్శకుడు కోరినట్టు తెలిపింది. అవకాశం కావాలంటే రాజీ పడాలని ఆమె సూచించింది. ఒక మహిళ ఇంకో మహిళతో ఈ మాట చెప్పడం ఆశ్చర్యపరిచిందని సయామీ ఇంటర్వ్యూలో వెల్లడించింది. మేడమ్ మీరు ఏం చెబుతున్నారో నాకు అర్థం కావడం లేదని అన్నాను. నేను పదే పదే దానిని రిపీట్ చేస్తూనే ఉన్నాను.. ఆపై చివరికి ఆమె ఇలా అంది. చూడండి.. మీరు అర్థం చేసుకోవాలి అని చెప్పింది. కానీ నేను ఆ మార్గంలో వెళ్లలేను. నా జీవితంలో నాకు కొన్ని పరిమితులు ఉన్నాయి. ఒక మహిళ ఇలా అనడం బాధించింది అని కూడా సయామీ ఇంటర్వ్యూలో అన్నారు. అయితే సయామీ ఖేర్ ఆ మహిళా కాస్టింగ్ ఏజెంట్ ఎవరో చెప్పలేదు. తనను కమిట్ మెంట్ అడిగిన దర్శకుడు ఎవరో కూడా వెల్లడించలేదు. ఆమె నన్ను రాజీ పడమని చెప్పిందని మాత్రమే అన్నారు. సయామీ తెలుగు చిత్రం రేయ్ (2015)తో తెలుగులో నటనా రంగ ప్రవేశం చేసింది. మిర్జ్యా (2016)తో హిందీలో అరంగేట్రం చేసింది. మౌళి (2018), చోక్డ్ (2020), వైల్డ్ డాగ్ (2021), ఘూమర్ (2023) చిత్రాలలో నటించింది. ఆమె స్పెషల్ (2020), ఫాదు (2022) అనే వెబ్ సిరీస్‌లలో కూడా నటించింది. బాలీవుడ్ బబుల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సయామి ఖేర్ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసారు. తెలుగు దర్శకుడు కమిట్మెంట్ అడిగాడని గుర్తు చేసుకున్నారు.

# అల్లు అర్జున్ అతిథిగా ఆ సంబరాలు..!



అల్లు అర్జున్ పుష్ప 2 సినిమా విడుదల తర్వాత కొన్ని వారాల పాటు విదేశాల్లో విశ్రాంతి తీసుకున్నారు. టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ స్టార్‌డం పుష్ప 2తో ఒక్కసారిగా పెరిగి పోయింది. పాన్ ఇండియా రేంజ్‌లో స్టార్ హీరోల జాబితాలో చోటు దక్కించుకున్న అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో సినిమాను చేస్తున్నాడు. అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న బన్నీ-అట్లీ కాంబో మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి వీఎఫ్ఎక్స్ కంపెనీ ఈ సినిమా కోసం వర్క్ చేయబోతుంది. అంతే కాకుండా హాలీవుడ్ సినిమాలకు వర్క్ చేసిన సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం వర్క్ చేయబోతున్నట్లు సమాచారం అందుతోంది. మొత్తానికి వీరి కాంబో మూవీ తెలుగు, తమిళ ప్రేక్షకుల్లోనే కాకుండా పాన్ ఇండియా ప్రేక్షకులకు ఆసక్తిని రేకెత్తిస్తోంది. అల్లు అర్జున్ పుష్ప 2 సినిమా విడుదల తర్వాత కొన్ని వారాల పాటు విదేశాల్లో విశ్రాంతి తీసుకున్నారు. అదే సమయంలో అట్లీ సినిమా కోసం ఫిజికల్‌గా రెడీ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ప్రముఖ ట్రైనర్ సమక్షంలో రెడీ అవుతున్న అల్లు అర్జున్ జులై నెలలో చిన్న బ్రేక్ తీసుకోబోతున్నట్లు సమాచారం అందుతోంది. యూఎస్‌లోని తెలుగు వారి కోసం ప్రత్యేక ఈవెంట్‌లో పాల్గొనేందుకు గాను అల్లు అర్జున్ వెళ్లనున్నారని సమాచారం అందుతోంది. జులైలో జరగబోతున్న 8వ అమెరికా తెలుగు సంబరాల్లో అల్లు అర్జున్ పాల్గొనేందుకు ఓకే చెప్పారు. ఇప్పటికే అల్లు అర్జున్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో నిర్వాహకులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.




# ఇస్మార్ట్ నిధి చీరలో అందాల విందు



సవ్యసాచి మరియు మిస్టర్ మజ్ను సినిమాలతో హీరోయిన్ గా టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ నిధి అగర్వాల్. మొదటి రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పర్చడంతో ఈ అమ్మడి కెరీర్ ముందుకు సాగడం కష్టమే అని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఈ అమ్మడికి ఇస్మార్ట్ సక్సెస్ దక్కడంతో కెరీర్ లో దూసుకు పోతుంది.రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన ఇస్మార్ట్ శంకర్ సినిమా లో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించి మెప్పించిన విషయం తెల్సిందే. ఆ సినిమా సూపర్ హిట్ అయిన వెంటనే పవన్ కళ్యాణ్ కు జోడీగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న హరి హర వీరమల్లు సినిమా లో నటించే అవకాశం దక్కించుకుంది.సినిమాల్లో ఏ స్థాయిలోఅందాలను ఈ అమ్మడు ఆరబోస్తూ ఉంటుందో సోషల్ మీడియాలో అంతకు మించి అన్నట్లుగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఉంటుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు మంచి కలర్ ఇంకా బాడీ లాంగ్వేజ్ ఉన్న నిధి అగర్వాల్ ఏ ఫొటోలు షేర్ చేసినా కూడా జనాలు వావ్ అనాల్సిందే.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com